క్లుప్తంగా

బాపనమ్మ తల్లికి పూజలు



బాపనమ్మ తల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తదితరులు

అనపర్తి: స్థానిక పాతవూరులో కర్రి అప్పారావు పార్కు వద్ద ఇటీవల కొలువుదీరిన శ్రీబాపనమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ వారా కుమారి, వ్యాపారవేత్తలు కర్రి అప్పారావు, కర్రి సూర్యప్రకాష్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కర్రి దొరబాబు, డాక్టర్ సునీల్‌కుమార్‌రెడ్డి, సత్తి విశ్వనాథరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ గుంటూరు శ్రీను, నారాయణరెడ్డి, సత్తి రామకృష్ణారెడ్డి, నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు రథ సప్తమి వేడుకలు



పందలపాకలో భద్రావతీ సమేత భావనారుషి ఆలయం వద్ద సూర్యభగవానుడు

బిక్కవోలు: రథ సప్తమి పర్వదినం సందర్భంగా శనివారం సూర్యభగవానుడి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాటు చేశారు. బిక్కవోలు మండలం పందలపాకలో సూర్యనారాయణ స్వామివారి ఆలయంలో తెల్లవారుజాము నుంచి విశేష పూజలు నిర్వహించనున్నారు. స్వామివారి దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. పెదపూడి, పందలపాకలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరుగనున్నాయి. ఇందుకు అనుగుణంగా ఆయా ఆలయాలను అందంగా ముస్తాబు చేశారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీ



ఎరువుల నిల్వలు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

బిక్కవోలు: బలభద్రపురంలోని శ్రీమణికంఠ ఏజెన్సీస్ పురుగు మందులు, ఎరువుల దుకాణంలో విజిలెన్స్ అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. డీఎస్పీ ముత్యాలనాయుడు మాట్లాడుతూ అమ్మకం ధర కన్నా ఎక్కువ ధరకు అమ్మడంతో రూ.18,122 విలువైన 3.06 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేశామన్నారు. షాపులో సీఐఎల్ యూరియా గరిష్ట అమ్మకం ధర రూ.266.50 ఉండగా రూ.290కు విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు. లీగల్ మెట్రాలజీ అధికారులతో కలసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ అధికారి భార్గవ మహేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

మధురపూడి: పశ్చిమ గానుగూడెం గ్రామంలోని రాధాకృష్ణ నగర్‌లో తాగునీటి సమస్య పరిష్కరించాలని స్థానిక మహిళలు శుక్రవారం అధికారులను కోరారు. గ్రామ సచివాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సతీష్‌ని కలసి సమస్య వివరించారు. కొన్ని రోజులుగా సమస్య ఉండడంతో ఇబ్బంది పడుతున్నట్టు వారు తెలిపారు.

నేడు కొంకుదురుకు స్పీకర్ రాక

బిక్కవోలు: కొంకుదురుకు శనివారం శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం రానున్నారని ఎంపీటీసీ సభ్యుడు కొంకుదురు పీవీ తెలిపారు. ఆ గ్రామంలో మాజీ ఎమ్మెల్యే పడాల సత్యనారాయణరెడ్డి, ఆయన కుమారుడు పాపారావు విగ్రహాల ఆవిష్కరణకు ఆయన వస్తున్నారన్నారు.

ఉచిత వైద్య శిబిరం



ఉచిత శిబిరంలో సేవలు అందిస్తున్న వైద్యులు

సీతానగరం: స్థానిక డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 300 మందికి సేవలందించారు. రాజమహేంద్రవరం గౌతమీ నేత్రాలయం, లెనోరా దంత వైద్యశాల, స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ ఏర్పాట్లను అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది నిర్వహించారని, విద్యార్థులు ఉత్సాహంగా సేవ చేశారని ప్రిన్సిపాల్ తెలిపారు.

చకాచకా.. అభివృద్ధి ఎంచక్కా

- రూ.48 కోట్లతో రోడ్ల విస్తరణ పనులు
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషితో సాకారం



ముగ్గళ్ల- కోరుకొండ రహదారి విస్తరణ పనులు

సీతానగరం: చూడచక్కగా రోడ్డు ముస్తాబవుతోంది... ప్రయాణం సాఫీగా సాగడానికి సిద్ధమవుతోంది.. విస్తరణ పనులతో విశాలంగా మారుతోంది.. అభివృద్ధి పనులతో దినదిన గండాలను తప్పించనుంది.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ఇది సాకారం అవుతోంది. రాజానగరం నియోజకవర్గంలో పలు సింగిల్ లైన్ రోడ్లలో ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పుకోవడానికి అనేక ఇబ్బందులు పడాల్సి వచ్చేది. రైతులకు సంబంధించిన ట్రాక్టర్లు వెళ్లే సమయంలో తప్పుకోవడానికి కష్టంగా ఉండేది. ఎదురుగా వచ్చే వాహనాలు నెమ్మదిగా దాటుకుంటూ వెళ్లేవి. రోడ్లు కేవలం మూడు మీటర్ల వెడల్పుతో ఉండేవి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం రాజానగరం నియోజకవర్గ ఎమ్మెల్యేగా జక్కంపూడి రాజా రోడ్ల ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆయన కృషితో సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చడానికి రూ.48 కోట్లు ఎన్‌డీబీ (న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్) నిధులు తీసుకువచ్చారు. దీంతో ముగ్గళ్ల- కోరుకొండ రోడ్డుకు రూ.30 కోట్లు, చినకొండేపూడి- నాగంపల్లి రోడ్డుకు రూ.18 కోట్లు కేటాయించడంతో విస్తరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. 14.5 కిలోమీటర్ల ముగ్గళ్ల- కోరుకొండ రోడ్డు గతంలో 3.75 మీటర్లు ఉండేది. విస్తరణ పనులతో డబుల్ రోడ్డుగా ఏడు మీటర్ల వెడల్పుతో విస్తరిస్తున్నారు. ఇరువైపులా 2.1 మీటర్ల రోడ్డును పెంచుతున్నారు. కొన్నిచోట్ల ఎక్కువగా తీసుకుంటే రోడ్డు విస్తరణ పనులు చేస్తున్నారు. అయితే తమ శాఖ భూములు రోడ్డుకు సరిపోతాయని ఆర్అండ్‌బీ అధికారులు అంటున్నారు. ఇదే విధంగా 8.40 కిలోమీటర్ల చినకొండేపూడి- నాగంపల్లి రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఇప్పుడు ఉన్న మూడు మీటర్ల రోడ్డు ఇరువైపులా ప్రొక్లెయిన్‌తో తవ్వకాలు జరిపి గ్రావెల్ వేసి, దానిపై మిక్స్ వేశారు. దానిపై రెండు లేయర్ల తారు రోడ్డు వేస్తారు. ముగ్గళ్ల- కోరుకొండ, చినకొండేపూడి- నాగంపల్లి రోడ్డు విస్తరణతో ప్రజలకు ఎంతో మేలు జరుగనుంది. ప్రయాణ కష్టాలు తప్పనున్నాయి.

ఎంతో సౌకర్యవంతంగా..



గత ప్రభుత్వంలో రహదారుల అభివృద్ధిని విస్మరించారు. దీనివల్ల రోడ్లు శిథిలం కావడంతో పలు ఇబ్బందులు పడ్డాం. వీటిని అభివృద్ధి చేయడానికి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా నిధులు తీసుకువచ్చారు. సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరిస్తున్నారు. చినకొండేపూడి- నాగంపల్లి రోడ్డు డబుల్ రోడ్డుగా మారుతుంది. ఇది ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది.

–ముదునూరి రామకృష్ణంరాజు, చినకొండేపూడి

ఇబ్బందులు ఉండవు..



కోరుకొండ- ముగ్గళ్ల రోడ్డు గతంలో సింగిల్ రోడ్డుగా ఉండేది. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషితో డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేస్తున్నారు. ఇది స్థానికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. వాహన రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ఇది ఎమ్మెల్యే కృషి ఫలితంగా సాకారం అయ్యింది.

–చౌటిపల్లి లాలుబాబు, కూనవరం

అందుబాటులో రేబిస్ వ్యాక్సిన్

మధురపూడి: కోటికేశవరం పీహెచ్‌సీలో యాంటీ రేబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉందని డాక్టర్ పుణ్యశాంతి తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులలో మాత్రమే అందుబాటులో ఉండే ఈ వ్యాక్సిన్‌ను బాధితులు వినియోగించుకోవాలని కోరారు. శుక్రవారం కోటికేశవరం, కోటి, సీతానగరం మండలం నాగంపల్లి, నల్లగొండ గ్రామాలకు చెందిన ఆరుగురికి ఈ వ్యాక్సిన్‌ను వేశామన్నారు. తమ పీహెచ్‌సీ పరిధిలో కోటికేశవరం, కోటి, బొల్లెద్దుపాలెం, రాఘవపురం, శ్రీరంగపట్నం గ్రామాలకు చెందిన ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నామన్నారు.

బీమా పరిహారం అందజేత

బిక్కవోలు: బలభద్రపురంలో సొసైటీ సభ్యుడు చిన్నం సత్తిరెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా అతని కుటుంబ సభ్యులకు సొసైటీ బీమా పరిహారాన్ని శుక్రవారం అందించారు. సొసైటీ సీఈవో పీవీ రామారెడ్డి మాట్లాడుతూ అతనికి రూ.లక్ష బీమా సొమ్ము విడుదలైందన్నారు. మృతుడి కుటుంబ సభ్యులకు ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ చైర్మన్ కర్రి వెంకట ముకుందరెడ్డి, సొసైటీ చైర్మన్ ఎస్‌వీవీ సత్యనారాయణ రెడ్డి, సబ్బెళ్ల పురుషోత్తమరెడ్డి అందజేశారని తెలిపారు.

ప్రణాళికతో చదివితే మెరుగైన ఫలితాలు



లాలాచెరువులో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు వెదవెంకన్న

రాజానగరం: విద్యార్థులు ప్రణాళికగా చదివితే పదో పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని ఎంపీపీ మండారపు సీతారత్నం అన్నారు. 10వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన 'విద్యాభారతి' స్టడీ మెటీరియల్‌ను మండలంలోని 14 జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు శుక్రవారం పంపిణీ చేశారు. పబ్లిక్ పరీక్షల పట్ల భయాన్ని పోగొట్టడంతో పాటు మంచి మార్కులు సాధించేందుకు అవసరమైన విజ్ఞానాన్ని అందించడంలో విద్యా భారతి తోడ్పడుతుందని జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెదవెంకన్న అన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు మండారపు వీర్రాజు, వేమగిరి కృష్ణ, మార్గాని శ్రీను, ప్రసాద్, రాజ్‌కుమార్, బండి నారాయణ, పోసు పీటర్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థికంగా ఎదిగేందుకు ఎన్నో అవకాశాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎఫ్‌పీఎస్ ప్రతినిధి చరణ్

రాజానగరం: ఫుడ్ ప్రోసెసింగ్ పరిశ్రమల ద్వారా ఆర్థికంగా ఎదిగేందుకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని ఏపీ ఫుడ్ ప్రోసెసింగ్ సొసైటీ (ఏపీఎఫ్‌పీఎస్) ప్రతినిధి చరణ్ అన్నారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో రాజానగరం, సీతానగరం, గోకవరం, రంగంపేట మండలాలకు చెందిన మహిళ సమాఖ్య అధ్యక్షులు, ఏపీఎంలు, సీసీలు, అకౌంటెంట్‌లకు శుక్రవారం ఒకరోజు ఓరియంటేషన్ ప్రోగ్రాం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విషయంలో ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని, అభివృద్ధి సాధించాలన్నారు. తయారు చేసే వస్తువులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించడంలో కూడా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. అందుబాటులో దొరికే ముడి పదార్థాలతో చేయగల విలువ జోడించిన ఉత్పత్తులు, సాంకేతిక అంశాలు, ఉపయోగించాల్సిన యంత్రాల గురించి అవగాహన కల్పించారు. సెర్ప్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ హేమంత్ మాట్లాడుతూ వ్యాపార ప్రణాళికను సిద్ధం చేసుకోవడంతో పాటు బ్యాంకర్ల నుంచి అవసరమైన రుణాలు పొందే విధానాన్ని తెలిపారు. ఫుడ్ ప్రోసెసింగ్‌లో ధాన్యం రుబ్బడం, పచ్చి పిండి తయారు చేయడం నుంచి ఇంటి వంట వరకూ సౌకర్యవంతమైన ఆహారాలను తయారు చేయడానికి ఉపయోగించే పద్ధతులను వివరించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

సీతానగరం: కూనవరం గ్రామానికి చెందిన సుంకర మణికంఠ (28) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడని హెడ్ కానిస్టేబుల్ టి.లోవకుమార్ శుక్రవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మణికంఠ వ్యవసాయం చేస్తూనే పురుగు మందు షాపు నిర్వహిస్తున్నాడు. వ్యవసాయం, వ్యాపారం లోనూ నష్టం రావడంతో మనస్తాపం చెంది గురువారం మధ్యాహ్నం పురుగు మందు తాగాడు. ఇంటికి వచ్చి వాంతులు చేసుకోవడంతో రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడ మరణించాడు. మృతుడికి తండ్రి రామకృష్ణ, తల్లి ప్రభావతి, అక్క ఝాన్సీ ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

ప్రతి గ్రామాన్ని సుందరంగా తీర్చిదిద్దాలి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేసి ప్రతి గ్రామాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని జిల్లా పంచాయతీ అధికారి పి.జగదాంబ ఆదేశించారు. శుక్రవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆమె అధ్యక్షతన రాజమహేంద్రవరం డివిజనల్ పంచాయతీ కార్యదర్శుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ, జిల్లా స్థాయిలో ఉన్న కోర్టు కేసులపై పంచాయతీ కార్యదర్శులు సత్వరమే చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న స్వచ్ఛ సంకల్ప (జేఎస్ఎస్) పథకంలో అమలు చేయాల్సిన కార్యక్రమాలను 100 శాతం పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే మొదలు పెట్టిన ఇంటి పన్నుల వసూళ్ల నెలాఖరు నాటికి 70 శాతం, ఫిబ్రవరి 15వ తేదీకి 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. స్పందనలో వచ్చిన ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలన్నారు. స్వామిత్వ (జగనన్న భూ హక్కు మరియు భూ రక్ష పథకం)లో ఎంపిక చేసిన గ్రామాలలో సర్వేను నిర్ణీత గడువు లోగా పూర్తి చేయడం, ప్లాస్టిక్ వినియోగం పూర్తిగా నిషేధించడానికి ప్రభుత్వం నిర్దేశించిన ప్రణాళికలను పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. గణతంత్ర దినోత్సవంలో కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్న అధికారులు, సిబ్బందిని జగదాంబ అభినందించారు. డివిజనల్ పంచాయతీ అధికారి జానా సత్యనారాయణ, స్వామిత్వ నోడల్ అధికారి కేవీఆర్ఎల్ పద్మజ, జేఎస్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ ఆర్మ్‌స్ట్రాంగ్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- లక్ష్మీనరసాపురంలో గడప గడపకూ..



అమ్మఒడి అందిందా అంటూ చిన్నారులను ఆప్యాయంగా పలకరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం లక్ష్మీనరసాపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను ఆయన ఆప్యాయంగా పలుకరిస్తూ, ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మూడున్నరేళ్లగా అర్హులందరికీ పథకాలు అందాయన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన కరపత్రాలను ఆయన గడప గడపకూ తిరిగి ప్రజలకు అందజేశారు. సర్పంచ్ దాట్ల కిరణ్‌రాజు, ఎంపీటీసీ సభ్యుడు సూరకాసుల శివ, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్, పార్టీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ జి.మంగాయమ్మ, కుతుకులూరు ఎంపీటీసీ సత్తి దొరయ్యరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పడాల శ్రీనివాసరెడ్డి, కర్రి శ్రీనివాసరెడ్డి, పంచాయతీ పాలకమండలి సభ్యులు చిట్టేటి సత్యనారాయణ, శ్రీలం శ్రీనివాస్, గంటా పార్వతి, కె.వెంకటలక్ష్మి, మీసాల సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థినులకు చట్టాలపై అవగాహన



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న శ్రీనివాసరావు

గోకవరం: విద్యార్థినులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని చైల్డ్ లైన్-1098 జిల్లా కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని వీరలంకపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు శుక్రవారం పలు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ కేఎంవీ రాణి ఆధ్వర్యంలో కోఆర్డినేటర్ శ్రీనివాసరావు విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల్య వివాహాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చైల్డ్ లైన్ సిబ్బంది బి.రాజ్‌కుమార్, జి.క్రాంతిలాల్, మహిళా సంరక్షణ అధికారి నూర్, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

దళిత సంఘాల ఆందోళన

గోకవరం: స్థానిక పంచాయతీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో జెండా స్తంభం వద్ద అంబేడ్కర్ చిత్రపటం లేకపోవడంపై పలు దళిత సంఘాల నాయకులు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. స్థానిక ఠాణా సెంటర్‌లో రోడ్డుపై నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ చిత్రపటం లేకుండా గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించిన వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్, ఎంపీడీఓలకు వినతి పత్రాలు అందజేశారు.

• కమ్మేసిన పొగ మంచు



రాజమహేంద్రవరం విమానాశ్రయం రోడ్డులో పొగ మంచు

మధురపూడి: రాజమహేంద్రవరం విమానాశ్రయం రోడ్డును శుక్రవారం పొగ మంచు కమ్మేసింది. ఇటుగా తెలంగాణ రాష్ట్రం భద్రాచలం, అల్లూరి సీతారామరాజు జిల్లాకు ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు వెళ్తుంటాయి. ఉదయం ఏడు గంటలైనా రోడ్డుపై మంచు ఆవరించి ఉండడంతో వాహనదారులకు ఇబ్బంది తప్పలేదు. పలు గ్రామాల నుంచి కూరగాయలను రాజమహేంద్రవరానికి తరలించే రైతన్నలూ అవస్థలు పడ్డారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు



కలెక్టర్ మాధవీలత నుంచి అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

రంగంపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు ఉత్తమ ప్రిన్సిపాల్‌గా ఎంపికయ్యారు. రిపబ్లిక్ డే సందర్భంగా గురువారం రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాధవీలత చేతుల మీదుగా ఆయన అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు. శ్రీనివాసరావును శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. కళాశాల అధ్యాపకులు రామకృష్ణ, కృష్ణమూర్తి, ఉదయ్‌తేజ, శిరీష, రేవతిలక్ష్మి, పద్మావతి, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

వైభవంగా సత్యసాయి వ్రతాలు



సీతానగరంలో సత్యసాయి వ్రత పూజలు చేస్తున్న మహిళలు

సీతానగరం: స్థానిక సత్యసాయి మందిరం 24వ వార్షికోత్సవం సందర్భంగా సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం సామూహిక సత్యసాయి వ్రతాలు జరిగాయి. తెల్లవారు జామున నగర సంకీర్తన, సత్యసాయి బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 100 మంది మహిళలు శ్రీసత్యసాయి వ్రతాల్లో పాల్గొనగా, రాజమహేంద్రవరానికి చెందిన రఘుపతి మాస్టారు వ్రతాలను చేయించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నరసింహయ్య మృతి తీరని లోటు



పెదపూడిలో నరసింహయ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

పెదపూడి: సీపీఐ (ఎంఎల్) జనశక్తి రాష్ట్ర కార్యదర్శి నంబి నరసింహయ్య సంస్మరణ సభ ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెదపూడి గవర్నమెంట్ హాస్పిటల్ ఎదురుగా జరిగింది. నరసింహయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు మాట్లాడుతూ నరసింహయ్య మృతి విప్లవ ఉద్యమానికి తీరని లోటు అన్నారు. కార్యక్రమంలో నాయకులు మడికి సత్యం, మల్లవరపు రాజు, వడ్డమూరి మంగాదేవి, బొచ్చ యేసు, వల్లూరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా రహదారి విస్తరణ పనులు

మధురపూడి: రాజమహేంద్రవరం నుంచి విజయనగరం వరకూ ఉన్న 516 జాతీయ రహదారి విస్తరణ పనులు జోరుగా జరుగుతున్నాయి. కోరుకొండ మండలం బూరుగుపూడి నుంచి గోకవరం మండలం వరకూ 11 కిలోమీటర్ల పొడవున పనులు చేయాల్సి ఉంది. ఇందులో ఇప్పటికే 7 కిలోమీటర్ల పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులూ వేగంగా చేస్తున్నారు.

బూరుగుపూడి- కోరుకొండ మధ్య రహదారి విస్తరణ పనులు →

